క్లుప్తంగా

సైబర్ నేరాల నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్సై పారినాయుడు

కంచిలి: సైబర్ నేరాల నియంత్రణకు అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సహకరించాలని స్థానిక ఎస్సై పి.పారినాయుడు కోరారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, నియంత్రణకు చేపట్టాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, డీఆర్పీలు వై.శంకరరావు, ఎస్.గోపి, ఐ.భాస్కరరావు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో అవినాష్ ప్రతిభ



బహుమతి అందుకుంటున్న అవినాష్

కాశీబుగ్గ: ఏలూరు జిల్లా చింతలపూడిలో ఈ నెల 23వ తేదీన జరిగిన మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన కొండ అవినాష్ ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన అవినాష్ రాణించడంతో కోచ్ శివ మహరణ, కోట శ్రీకాంత్, రవి దాలాల్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. తవ్రలో ముంబైలో జరగబోయే జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు అవినాష్ అర్హత సాధించినట్టు తెలిపారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు నలుగురు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్

ఇచ్ఛాపురం టౌన్: పురుషోత్తపురంలోని మోడల్‌స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు సోమవారం తెలిపారు. ఎంపికైన వారిలో ఎనిమిదో తరగతి విద్యార్థినులు 8వ జి.యామినికుసుమ, పి.ఝాన్సీ, బి.భాగ్యశ్రీ, బి.చంద్రిక ఉన్నారన్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఏడాదికి రూ. 12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మొరాయించిన లారీ

కవిటి: మండలకేంద్రం కవిటి సినిమా హాల్ రోడ్డులో బజారువీధికి వెళ్లే మలుపులో పదిటైర్ల లారీ సోమవారం ఉదయం మొరాయించింది. భారీ లోడుతో లారీ ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు మూడు గంటల పాటు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం టౌన్: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటరావు సోమవారం పరిశీలించారు. ఈ కేంద్రంలో 111 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తహసీల్దార్ తెలిపారు. పరిశీలనలో పట్టణ ఎస్ఐ ముకుందరావు ఉన్నారు.

సమసమాజ స్థాపన కమ్యూనిస్టుల లక్ష్యం

టెక్కలి: సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపరా వెంకటరమణ అన్నారు. ధర్మనీలాపురం గ్రామానికి చెందిన మొజ్జాడ యుగంధర్ ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా నియామకమైన సందర్భంగా సోమవారం గ్రామంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. సమాజంలో నిరుద్యోగ యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, ఎం.కరుణాకర్, పి.బలరాం, జి.గణేష్, జి.భానూజీరావు, పి.సాయిరాజ్, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో .. ‘జ్ఞానజ్యోతి’ వెలుగులు!

- మారనున్న చదువులు
- కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ తరగతులు



చిన్నారుల బోధనకు బోధనోపకరణాలు తయారు చేస్తున్న కార్యకర్తలు



శిక్షణలో సామాజిక, భావోద్వేగ కృత్యాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఇచ్ఛాపురం రూరల్: జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసు గల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా ‘జ్ఞానజ్యోతి’పేరిట ప్రత్యేక కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శిక్షణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు చిన్నారులకు మెరుగైన విద్యా బోధన చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు మొదటి, రెండవ విడతల్లో ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి ఒకటి, రెండు తరగతులు బోధించే విధంగా పిల్లల మానసిక, అభ్యసనా స్థాయిలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నదే శిక్షణ కార్యక్రమం లక్ష్యం.

ఆటపాటలతో శిక్షణ తరగతులు..

పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు అనేక కృత్యాల ద్వారా భవిష్యత్తులో వారు చదవబోయే విద్యకు సంబంధించిన బలమైన పునాదులు ఇక్కడే నిర్మించుకుంటారు. వారు చదవడం, రాయడం, ఇతరులతో సంభాషించడం, భాషను అభివృద్ధి చేసుకుంటూ భావోద్వేగాలను అదుపు చేసుకొని తోటి బాలలతో కలసి మెలసి ఉండడాన్ని నేర్చుకుంటారు. ఈ విద్యావిధాన పునర్నిర్మాణంలో ‘పునాది దశ’గా పేర్కొంటూ అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తోంది. ఇందులో భాగంగా ఊహాత్మక, అనుకరణ, వివిధ రకాల ఆటలు, దుస్తులు ధరించడం, ప్రకృతి సందర్శన, నటన, ప్రకృతి శాస్త్రీయ జ్ఞానం, గణిత సంబంధిత ఆటలు, పజిల్స్, అక్షరాలు, సంఖ్యలను చిన్నారులు గుర్తు పట్టే విధంగా బోధన చేసేలా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు తల్లిదండ్రులు, సమాజ సభ్యుల ప్రమేయంతో పిల్లల అభ్యసన, ఎదుగుదల, అభివృద్ధిలో భాగస్వాములుగా చేసే విధంగా శిక్షణ ఇస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధన నైపుణ్యతను పెంపొందించడమే లక్ష్యంగా సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 120 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు.

మెరుగైన ఫలితాల కోసం



జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై ఫోకస్ పెట్టడం జరిగింది. ఫైండేషన్ లిటరసీ, న్యూమరసీ ప్రోగ్రాంలో భాగంగా ఇప్పటికే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– పురాణం నాగరాణి, సీడీపీవో, ఇచ్ఛాపురం మండలం

సులభతర బోధనకు శిక్షణ దోహదం



జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రస్తుతం మాకు ఇస్తున్న శిక్షణ చిన్నారులకు సులభతర బోధనకు ఎంతో ఉపయోగపడుతోంది. శారీరక మేధ, సామాజిక, భావోద్వేగ, భాష, అక్షరాస్యత, సౌందర్య, సాంస్కృతిక వికాసంపై శిక్షణ పొందుతున్నాం.

– పరపటి లలిత, అంగన్‌వాడీ కార్యకర్త, మందపల్లి

శోభాయాత్ర



కంచిలి మండలంలోని బూరగాం గ్రామంలో భోళా లింగేశ్వర స్వామి శోభాయాత్ర సోమవారం ఘనంగా జరిగింది. పురాణ ఇతిహాసాలతో కూడి ఉన్నటువంటి వేషధారణలతో గురుస్వాములు దాసు, కొక్కిలి దేవదత్తుల ఆధ్వర్యంలో శివస్వాములు శోభాయాత్రను నిర్వహించారు. గ్రామానికి చెందిన శివభక్తులంతా యాత్రలో పాల్గొన్నారు.

– కంచిలి

నిత్యం ట్రాఫిక్ అవస్థలు..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి డిగ్రీ కళాశాల రోడ్డులో నిత్యం ట్రాఫిక సమస్య వెంటాడుతోంది. ద్విచక్ర వాహనాల రాకపోకలకు సైతం ఇబ్బందిగా ఉంటుంది. గాంధీనగర్–1, 2, కేటీ రోడ్డుకు ఆనుకుని ఉన్న సబ్ రోడ్లపై వ్యాపారానికి సంబంధించిన ఆటోలు, వ్యాన్‌లు, లారీలు నిలిపి వేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. రిజిష్టర్ కార్యాలయం, ఆంధ్రా బ్యాంకు, బంకేశ్వర రోడ్లు, గున్నేశ్వరనగర్, న్యూకాలనీ, తిలక్ నగర్ వీధుల్లో ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య కనిపిస్తుంది. వ్యాపారాలకు సంబంధించిన వాహనాలు కేటాయించిన సమయాలకు విరుద్ధంగా పట్టణంలోకి ప్రవేశిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య వెంటాడుతుంది.

–కాశీబుగ్గ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య అన్నారు. పట్టణంలో సురంగి రాజా క్రీడా మైదానం ఆవరణలో స్థానిక పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యోగా విజ్ఞాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. హరిద్వార్ పతంజలి యోగా శిబిరం స్వామి రాందేవ్‌బాబా ముఖ్య శిష్యులు స్వామి రిత్విది జీ మహారాజ్ స్థానిక యోగా సాధకులతో యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ధ్యానం, ప్రాణాయామములు చేయించారు. స్థానిక పతంజలి యోగా సమితి అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, జనసేన పార్టీ పట్టణ ఇన్‌చార్జి దాసరి రాజు, ఆశి లీలారాణి, దుఖీశ్యాం, రేణుకా చౌదరి, ఈశ్వర్, నీలాపు వాసు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం

పేదల కాలనీలో ఆక్రమణలు!



పాతాళసిద్ధేశ్వరాలయం వద్ద పేదలకు కేటాయించిన కాలనీలో జరిగిన ఆక్రమణలు



కాలనీ ఖాళీ స్థలాన్ని ఆక్రమించి సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు కేటాయించిన జగన్న కాలనీలోని ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్నుపడింది. కూటమి నాయకుల అండతో ఖాళీ స్థలాలను ఆక్రమించే పనిలో కొంతమంది నిమగ్నమయ్యారు. పేదలకు ఇంటి స్థలాలను కేటాయించే క్రమంలో నిర్దేశించిన నిర్ణీత కొలతలతో ఇళ్ల స్థలాలను కేటాయించి వాటికి జియోట్యాగింగ్ కూడా చేశారు. లేఅవుట్లలో మిగిలిన ఖాళీ స్థలాలను భవిష్యత్ దృష్ట్యా కమ్యూనిటీ హాల్, పార్కులు, లైబ్రరీలు వంటివి నిర్మాణం నిమిత్తం వాటిని ఎవరికీ కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల కాలనీని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ప్రస్తుతం కాలనీల్లోని ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్నుపడింది. పాతాళసిద్ధేశ్వరాలయం సమీపంలో కేటాయించిన జగనన్న కాలనీలో 786/190 నంబర్ గల ఇంటికి సమీపంలో గల ఖాళీస్థలాన్ని అక్రమణదారులు ఆక్రమించుకొని చుట్టూ కంచె వేయడం, పునాదులు, సెప్టిక్‌ట్యాంక్ నిర్మాణాలు చేపడతున్నారు. కాలనీపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించడంతోపాటు ఖాళీ స్థలాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు..

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ రామారావు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ రామారావు

కవిటి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా జగన్‌ను కలిసి మాట్లాడారు.

సామాజిక తనిఖీకి సమాయత్తం

నందిగాం: నందిగాం మండలంలో 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించేందుకు సిబ్బంది సమాయత్తం అవుతున్నారని ఎస్ఆర్‌పీ ఎం.తిరుపతిరావు సోమవారం తెలిపారు. ఉపాధి పనులు, పంచాయతీరాజ్ పనులు, సర్వశిక్షా, ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ ఫారెస్ట్ విభాగాల్లో ఖర్చుచేసిన రూ.22.80 కోట్ల పనులపై తనిఖీలు నిర్వహిస్తారన్నారు. 37 పంచాయతీలలో నిర్వహించే తనిఖీల్లో ఏడు డీఆర్‌పీలు, 14 వీఎస్‌ఏలు పాల్గొంటారన్నారు.

ఏఎన్‌యూ దూర విద్యా కోర్సులకు నోటిఫికేషన్

టెక్కలి: టెక్కలి మండలం పాతనౌపడ సమీపంలోని ప్రణవి డిగ్రీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం దూర విద్యా ద్వారా డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల డైరెక్టర్ పి.చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఎస్సీ, బీఏ, బీకాంతో పాటు ఎమ్మెస్సీ, ఎంఏ అన్ని విభాగాలు, ఎంహెచ్ఆర్ఎం, ఎంకాం బ్యాంకింగ్, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు చెప్పారు.

మేట్లుగా కొనసాగించాలని వినతి



ఏపీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: వేతనదారుల మద్దతు తమకు ఉన్నందున మేట్లుగా కొనసాగించాలని మశాఖపురం ఉపాధి మేట్లు పాల గీత, ఆశి ఇందిరా కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఉపాధి హామీ పథకం ఏపీవో పి.శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంలో భాగంగా శ్రమశక్తి సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా మేట్లుగా ఉండాలని ఎన్నుకున్న నేపథ్యంలో తమను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

పలాస: రంగోయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్దానం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ‘భారత దేశం అంతరిక్ష పరిశోధనలో సాధించిన విజయాలు’అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు టి.హేమారావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈనెల 28వ తేదీన జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పీటీ లక్ష్మణరావు, ఫౌండేషన్ ప్రతినిధులు టి.శ్రీకాంత్, జి.ధనుంజయ, ఎస్.వాసుదేవు, ఎం.షణ్ముఖరావు, జి.కూర్మారావు పాల్గొన్నారు.

నిలదీస్తారనే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకున్న చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలకు చేస్తున్న మోసాలపై అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తారనే భయంతోనే వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2015 ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో ఢిల్లీలో ఆప్ గెలిచినప్పటికీ అత్యల్పంగా మూడు సీట్లు ఉన్న బీజేపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న టీడీపీ మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతోందన్నారు. ప్రజా సమస్యల ప్రస్తావన లేకుండా ఏకపక్షంగా అసెంబ్లీని నిర్వహించేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం దక్కించుకున్న తరువాత ఇసుక, మద్యం మాఫీయాలు, అమరావతి భూకుంభకోణాలకు పాల్పడిన కూటమి నాయకుల బండారం బయటపడుతుందనే భయం చంద్రబాబులో ఉందన్నారు. ఇటీవల గ్రూప్–2 పరీక్షల వ్యవహారంలో సైతం రోస్టర్ విధానంలో తప్పిదాలు ఉన్నాయని నిరుద్యోగులు నడి రోడ్డుపై ధర్నాలు చేసినప్పటికీ అవేమి పట్టనట్టుగా వ్యవహరిస్తూ వారి జీవితాలతో ఆటలాడుకున్నారన్నారు. కూటమి పార్టీలన్నీ కలిసినప్పటికీ ఒంటరిగా పోరాటం చేసిన వైఎస్సార్‌సీపీకి 40 శాతం ఓట్లు షేర్‌తో దేశంలో అతి పెద్ద పార్టీగా గుర్తింపు సాధించిందని గుర్తు చేశారు.

తేజ రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను విశాఖ వరకు పొడిగించాలి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పురుషోత్తం యాదవ్

కంచిలి:భువనేశ్వర్ నుంచి న్యూఢిల్లీ, న్యూఢిల్లీ నుంచి భువనేశ్వర్‌కు (రైలు నంబర్లు 22811, 22812) ప్రతి ఆది, బుధవారాల్లో నడుస్తున్న తేజ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును విశాఖ వరకు పొడిగించాలని సోంపేట రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది బి.పురుషోత్తం యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ద్వారా కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కోరినట్లు సోమవారం తెలిపారు. ఈ రైలును విశాఖ వరకూ పొడిగిస్తే విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతోపాటు ఒడిశా పరిధిలో ఉన్న కొరాపుట్, గజపతి, గంజాం, ఖుర్దా జిల్లాల ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందన్నారు.

ధీర వనిత జయక్కకు నివాళులు



జయక్కకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: సిక్కోలు గిరిజన సాయుధ రైతాంగ పోరాట ధీర వనిత పోతనపల్లి జయక్క ఐదో వర్ధంతి సభను పలాస మండలం బొడ్డపాడులో సోమవారం ప్రజాసంఘాల నాయకులు నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు జయక్క త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వంకల మాధవరావు, జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, ఎస్.కృష్ణవేణి, హేమక్క, జానకమ్మ, జుత్తు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మిస్సింగ్ సిటిజన్ల సర్వే



మాట్లాడుతున్న డీఈ కృష్ణమూర్తి

కాశీబుగ్గ: వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో మ్యాపింగ్ కాని సిటిజన్లు తక్షణమే మ్యాపింగ్ చేసి సిటిజన్ సర్వేకు పూర్తి చేయాలని పలాస విద్యుత్‌శాఖ డీఈ ఐఎస్ కృష్ణమూర్తి ఆదేశించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నడిపేన రామారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలాస మండలానికి సంబంధించిన సర్వే పూర్తి చేసే బాధ్యత సచివాలయ అడ్మిన్లపై ఉందన్నారు. ఎనర్జీ కార్యదర్శులతో కలిసి సర్వే వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ పలాస, కాశీబుగ్గ ఏఈలు ఎ.నాగభూషణరావు, ఎస్.వివేకానంద పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ప్రచారం



మందసలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుభాషిని, నాయకులు

కంచిలి/కవిటి/టెక్కలి/మందస: ఎమ్మెల్సీ ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. పాకాలపాటి రఘువర్మకు మద్దతుగా కంచిలి మండలంలోని పలు గ్రామాల్లో ఏపీటీఎఫ్ నాయకులు ప్రచారం చేశారు. అలాగే కవిటి మండలంలో కూడా రఘువర్మ తరఫున ఏపీటీఎఫ్ ప్రతినిధులు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల మద్దతు కోరారు. పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీకి మద్దతుగా యూటీఎఫ్ మహిళా విభాగం ప్రతినిధులు టెక్కలి మండలంలో ప్రచారం నిర్వహించారు. మందస మండలంలో కూడా పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరీకి మద్దతుగా యూటీఎఫ్ ప్రతినిధులు ప్రచారం చేశారు.

సంక్షిప్తంగా...

రూ.50 వేల వితరణ

పలాస: మండలంలోని కిష్టుపురం గ్రామానికి చెందిన బూర్లె ఢిల్లేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. అతనికి తలగాన వాసు అనే దాత రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని టీడీపీ నాయకుడు వెంకన్న చౌదరి చేతులు మీదుగా సోమవారం అందజేశారు. శ్రీశైన సాధికారిక సభ్యులు బూర్లె సూర్యకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పి.సుధీర్‌కుమార్ రచించిన ప్రాపబుల్టి అండ్ క్యూయింగ్ థీరి అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఓడీ బి.రమేష్‌నాయుడు, ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు

టెక్కలి: రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాని ముందు మతత్రయ ఏకాదశి సందర్భంగా భక్తులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. మల్లన్న ప్రాంగణం శివనామ స్మరణతో ఆధ్యాత్మికత సంతరించుకుంది

దాడి చేశారని ఫిర్యాదు

టెక్కలిరూరల్: తనపై కుమారుడు, కోడలు దాడి చేశారంటూ టెక్కలి మండలం పెద్దసాన గ్రామానికి చెందిన పిల్లల ఆదెమ్మ సోమవారం రాత్రి టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను సక్రమంగా చూసుకోవడం లేదని గ్రామపెద్దల దృష్టికి తీసుకువెళ్లగా.. ఈ విషయం తెలుసుకున్న కుమారుడు, కోడలు దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బ్యాంకింగ్ సేవలు సద్వినియోపరచుకోవాలి

ఇచ్ఛాపురం రూరల్: స్వయం సహాయక సంఘ సభ్యులు అన్ని రకాల బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ లిలెస్ట్ మిశ్రా అన్నారు. సోమవారం స్వయం సహాయక సంఘ సభ్యులతో స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు మాట్లాడారు. బ్యాంకింగ్ సేవలు, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, పీఎం సూర్యాఘర్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్, సంఘ లీడర్లు పాల్గొన్నారు.